క్లుప్తంగా

చెడు అలవాట్లకు దూరంగా ఉండాలి



సిరిసిల్ల: మానసిక ఆరోగ్యానికి ప్రాధాన్యమివ్వాలని ప్రముఖ సైకాలజిస్ట్ కె.పున్నంచందర్ అన్నారు. పట్టణంలోని బీవైనగర్‌లో బుధవారం మైండ్ కేర్ అండ్ కౌన్సెలింగ్ సెంటర్ ఆధ్వర్యంలో సామూహిక కౌన్సెలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...మంచి ఆరోగ్యపు అలవాట్లు శారీరక ఆరోగ్యంపైననే కాకుండా మానసిక ఆరోగ్యంపై ప్రభావం చూపుతాయన్నారు. మద్యపానం, తంబాకు నమలడం, సిగరేట్‌కు తాగడం వంటి చెడు అలవాట్లకు దూరంగా ఉండాలన్నారు. కౌన్సెలింగ్ సెంటర్ సేవలు సద్వినియోగం చేసుకోవాలన్నారు.మనోవికాస కేంద్రం సిబ్బంది రాపెల్లి లత, వేముల అన్నపూర్ణ, బూర శ్రీమతి తదితరులు పాల్గొన్నారు.

అగ్నిమాపక కేంద్రం సందర్శన



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న అగ్నిమాపక సిబ్బంది

వేములవాడఅర్బన్: పట్టణంలోని కృష్ణవేణి టాలెంట్ స్కూల్ 6వ తరగతి నుంచి 9వ తరగతి పిల్లలకు క్షేత్రస్థాయి పర్యటనలో భాగంగా బుధవారం పట్టణంలోని అగ్నిమాపక కేంద్రాన్ని సందర్శించారు. అగ్నిమాపక సిబ్బంది రోడ్డు ప్రమాదాలు, నీటి ప్రమాదాలు, వరదలు, ఇతర విపత్తులు సంభవించినప్పుడు అగ్ని మాపక దళం ఏ విధంగా కృషి చేస్తుందో తెలుసుకున్నారు. ప్రిన్సిపాల్ రాజగోపాల్‌చారి, విద్యార్థులు తదితరులు ఉన్నారు.

29న కు.ని శిబిరం

సిరిసిల్ల కల్చరల్: వేములవాడ ప్రాంతీయ ఆస్పత్రిలో ఈనెల 29న కుటుంబ నియంత్రణ శిబిరం నిర్వహిస్తున్నట్లు జిల్లా వైద్య ఆరోగ్య అధికారి వసంత రావు ఒక ప్రకటనలో తెలిపారు. శుక్రవారం ఉదయం 9 గంటలకు ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ శిబిరాన్ని ప్రారంభిస్తారన్నారు. జిల్లా ప్రజలు అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు.

కవితల పోటీల్లో ప్రతిభ

ముస్తాబాద్: తెలంగాణ సారస్వత పరిషత్ నిర్వహించిన కథలు, కవితల పోటీల్లో మండలంలోని ఆవునూర్ జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు సత్తాచాటారు. తొమ్మిది తరగతి చదువుతున్న లక్ష్మీ ప్రసన్న రాసిన చదువు విలువ అనే కథ ప్రత్యేక బహుమతి సాధించిందని హెచ్‌ఎం మద్దికుంట లక్ష్మణ్ తెలిపారు. అలాగే మరో పదకొండు మంది విద్యార్థులు రాసిన కథలు, కవితలకు ప్రశంస పత్రాలు వచ్చాయన్నారు. ఉపాధ్యాయులు శారద, పర్శరాములు, లక్ష్మీనారాయణ, గణేశ్, విశ్వనాథ్, సువర్ణ, కవిత, పద్మ, మనోహర్, దీప్తి, ప్రభాకర్ పాల్గొన్నారు.

విద్యార్థులకు కంటి పరీక్షలు



కంటి పరీక్షలు చేస్తున్న వైద్యులు

బోయినపల్లి: మండలకేంద్రంలోని మోడల్‌స్కూల్ విద్యార్థులకు జాతీయ అంధత్వ నివారణ సంస్థ ఆర్బీఎస్‌కే టీం–బీ కంటి వైద్యబృందం ఆధ్వర్యంలో బుధవారం కంటి పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా 5వ తరగతి నుంచి ఇంటర్ చదివే విద్యార్థులకు కంటి పరీక్షలు చేశారు. దృష్టిలోపం ఉన్న విద్యార్థులకు ఉచితంగా కళ్లద్దాలు పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. వైద్యులు లహరిక, పావని, ఆప్తాల మిస్టులు ఎం.రమేశ్, బీ.భుజంగ్‌రెడ్డి, ఏఎన్‌ఎం సౌజన్య, ఆశా కార్యకర్త ఉన్నారు.

ఆలయ సాగుభూమికి వేలం



ఎల్లారెడ్డిపేట: మండలకేంద్రంలోని వేణుగోపాలస్వామి ఆలయానికి చెందిన సాగు భూమి ఐదెకరాలకు బుధవారం వేలం పాట నిర్వహించారు. గ్రామ పంచాయతీ ఆవరణలో ఏర్పాటు చేసిన వేలంలో రైతులు పెద్దఎత్తున పాల్గొన్నారు. ఎల్లారెడ్డిపేటకు చెందిన సద్ది లక్ష్మారెడ్డి రూ. 80వేలకు వేలం పాట పాడి ఏడాది వరకు సాగు చేసేందుకు పొలం దక్కించుకున్నారు. ఆలయం తరపున మేగి నర్సయ్య వేలం పాట పాడగా, ఎనిమిది మంది రైతులు ఒక్కొక్కరు రూ. 10వేల చొప్పున డిపాజిట్ ముందుగా చెల్లించి వేలంలో పాల్గొన్నారు. సలువాల శ్రీనివాస్ అనే రైతు రూ. 79వేల వరకు పాట పడగా.. చివరగా సద్ది లక్ష్మారెడ్డి రూ. 80వేలకు వేలం దక్కించుకున్నారు. ఆలయ కమిటీ చైర్మన్ గడ్డం జితేందర్, వైస్ చైర్మన్ వెంకటేశ్‌గౌడ్, రైతు సంక్షేమ సంఘం అధ్యక్షుడు గుండాడి వెంకట్‌రెడ్డి, నాయకులు రాంరెడ్డి, రవీందర్‌రెడ్డి, బండారి బాల్‌రెడ్డి, లింగం, దేవయ్య, బాబు, రాజయ్య, గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు మరమ్మతు ఎప్పుడో ?



వేములవాడ రూరల్ మండలం హన్మాజిపేట నుంచి మూడపల్లి వెళ్లే రహదారి గుంతలమయంగా మారింది. గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం రూ. కోటి 6లక్షలు రోడ్డు పనుల కోసం నిధులు మంజూరుచేసింది. కానీ ఇప్పటివరకు పనులు మాత్రం కాంట్రాక్టర్ ప్రారంభించకపోవడంతో మూడపల్లి, చందుర్తి, రుద్రంగి మండల ప్రజలతో పాటు పలు గ్రామాల ప్రజలు రోజూ ఇబ్బందులు పడుతున్నారు. ఈ రోడ్డు మరమ్మతు పనులు చేపడితే దూరభారం తగ్గతుంది. రోడ్డు సమస్యపై ఆయాగ్రామాల ప్రజలు సంబంధిత అధికారులకు పలుసార్లు విన్నవించినా పట్టించుకోవడం లేదని వారు ఆరోపిస్తున్నారు.

– వేములవాడ రూరల్

బీడీ కార్మికులకు పింఛన్ అందించాలి

సిరిసిల్లటౌన్: బీడీ కార్మికులకు ప్రభుత్వం నెలకు రూ.2,500 పింఛన్ అందించాలని బీడీవర్కర్స్ యూనియన్ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు సూరం పద్మ డిమాండ్ చేశారు. బుధవారం పట్టణంలోని నెహ్రూనగర్, సాయినగర్‌లో రెండు కమిటీలను ఏర్పాటు చేసి మాట్లాడారు. కార్మికులు హక్కుల కోసం పోరాటాలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. బీడీ కార్మికులకు ఇందిరమ్మ ఇళ్లు అందించాలని డిమాండ్ చేశారు. రానున్న రోజుల్లో సీఐటీయూ బీడీ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో పోరాటాలు చేస్తామన్నారు. కార్యక్రమంలో బీడీ జిల్లా నాయకురాలు దాసరి రూప, లక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

డప్పు వాయించిన మహిళలు



వేములవాడ: వేములవాడ పట్టణంలో బుధవారం ఓ వేడుకలో మహారాష్ట్రకు చెందిన 16 మంది మహిళల జట్టు ఒకే రంగు దుస్తులు ధరించి పురుషులకు దీటుగా డప్పు వాయిస్తూ అబ్బురపరిచారు. పట్టణానికి చెందిన మచ్చ కిషన్ కుమారుడు మాధవ్ వివాహ వేడుకల్లో వీరి డప్పు ప్రదర్శనను చూసిన స్థానికులు ఒకింత ఆశ్చర్యానికి లోనయ్యారు. మహిళల బృందాన్ని అభినందించారు.

అరుణాచల గిరి ప్రదర్శనకు బస్సులు

వేములవాడఅర్బన్: వేములవాడ ఆర్టీసీ డిపోనుంచి డిసెంబర్ 15న అరుణాచలంలో జరిగే గిరి ప్రదక్షిణకు ప్రత్యేక లగ్జరీ బస్సులు నడిపించనున్నట్లు వేములవాడ ఆర్టీసీ డిపో మేనేజర్ శ్రీనివాస్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ప్యాకేజీ ధర ఒక్కరికి రూ. 4,500 ఉంటుందన్నారు. మరిన్ని వివరాలకు ఫోన్ 9959225926,7382851826 నంబర్లలో సంప్రదించాలని ఆయన కోరారు.

సమగ్ర శిక్ష ఉద్యోగులను క్రమబద్ధీకరించాలి



సిరిసిల్ల కల్చరల్: సమగ్ర శిక్ష అభియాన్‌లో భాగంగా ఉద్యోగ బాధ్యతలు నిర్వహిస్తున్న వారిని ప్రభుత్వం క్రమబద్ధీకరించాలని ఉద్యోగుల సంఘం అధ్యక్ష కార్యదర్శులు దుండిగల్ యాదగిరి ప్రభుత్వాన్ని కోరారు. బుధవారం జిల్లా విద్యాధి కారికి వినతిపత్రం అందజేశారు. ఈ పథకంలో పని చేస్తున్న ఉద్యోగులందరికీ 10 లక్షల ఆరోగ్య బీమా మరో 10 లక్షలు జీవిత బీమాసౌకర్యం కల్పించాలన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా సీఎం హామీమేరకు రాష్ట్రంలోని సమగ్ర శిక్ష ఉద్యోగులను క్రమబద్ధీకరించాలని, లేకపోతే నిరసన తెలుపుతామన్నారు. ఉద్యోగసంఘం ప్రతినిధులు పాల్గొన్నారు .

డిగ్రీ కళాశాలను సందర్శించిన ట్రైనీ ఐఏఎస్‌లు

గంభీరావుపేట: గంభీరావుపేటలోని ప్రభుత్వ డిగ్రీ అండ్ పీజీ కళాశాలను బుధవారం బీహార్, జార్ఖండ్‌లకు చెందిన ట్రైనీ ఐఏఎస్ అధికారుల బృందం సందర్శించింది. కళాశాలలోని ప్రయోగశాలలను, తరగతి గదులను పరిశీలించి విద్యార్థులతో మాట్లాడారు. కళాశాలలో నిర్వహించే ఉద్యోగ మేళాల గురించి అడిగి తెలుసుకున్నారు. కళాశాల నిర్వహణ గురించి వైస్ ప్రిన్సిపాల్ ప్రభాకర్, అధ్యాపకులు వారికి వివరించారు. అనంతరం మండలకేంద్రంలోని పురాతన దేవాలయమైన సీతారామస్వామి దేవస్థానం సందర్శించి పూజలు చేశారు. 700 ఏళ్ల నాటి నంద దీపం గురించి తెలుసుకున్నారు.



డిగ్రీ కళాశాలలో ట్రైనీ ఐఏఎస్‌లు

అభివృద్ధి పనులు ప్రారంభం



సిరిసిల్లటౌన్: పట్టణాన్ని ప్రణాళిక బద్ధంగా అభివృద్ధి చేస్తున్నట్లు సిరిసిల్ల మున్సిపల్ చైర్‌పర్సన్ జిందం కళ అన్నారు. బుధవారం స్థానిక 38వ వార్డులో అభివృద్ధి పనులను ప్రారంభించారు. అన్ని వార్డుల్లో మాదిరిగానే వార్డులో కూడా సీసీ రోడ్డును నిర్మిస్తున్నామన్నారు. మున్సిపల్ కమిషనర్ లావణ్య, డీఈ వాణి, ఏఈ నరసింహస్వామి, కౌన్సిలర్ గూడూరి భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

ఎస్పీని కలిసిన కాంగ్రెస్ నాయకులు



తంగళ్లపల్లి: జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్‌ను బుధవారం నూతన ఎస్పీ కార్యాలయంలో మండలానికి చెందిన పలువురు కాంగ్రెస్ నాయకులు మర్యాదపూర్వకంగా కలిశారు. కాంగ్రెస్ పార్టీ జిల్లా సేవాదల్ అధ్యక్షుడు మోర రాజు, జిల్లా కాంగ్రెస్ సోషల్ మీడియా కోఆర్డినేటర్ గడ్డం మధుకర్ (భోటు) ఎస్పీకి పుష్పగుచ్ఛం అందించి శాలువాతో సత్కరించారు.

ఉద్యమ కేసులు ఎత్తివేయాలి

సిరిసిల్లటౌన్: రాజన్న సిరిసిల్ల ఏర్పాటు కోసం పోరాటం చేసిన ఉద్యమకారులపై ఉన్న కేసులను ఎత్తివేయాలని కాంగ్రెస్ సీనియర్ నాయకుడు, బీసీ సంఘం జిల్లా అధ్యక్షుడు వీరవేణి మల్లేశం అన్నారు. బుధవారం కరీంనగర్ జిల్లా కోర్టులో ఉద్యమం కోసం పోరాడిన నాయకులు ఉద్యమకారులు కంసాల మల్లేశం, చొక్కాల రాము, మెలారం తిరుపతి, ఎండీ సలీమ్ తదితరులు కోర్టుకు హాజరయ్యారు. ఈ సందర్భంగా మల్లేశం మాట్లాడుతూ జిల్లా ఏర్పడితే బడుగు బలహీన వర్గాలు అభివృద్ధి, స్థానికంగా జిల్లా ఆఫీసులు వస్తే పేద ప్రజలకు అందుబాటులో ఉంటుందని పోరాటం చేయటం చేసినట్లు తెలిపారు. పదేళ్లు కావస్తున్నా ఇప్పటివరకు జిల్లా ఉద్యమకారులు కోర్టుల చుట్టూ తిరగాల్సి వస్తుందన్నారు. ఇప్పటికైనా జిల్లా ఉద్యమకారులపై ఉన్న కేసులను ఎత్తివేయాలని ప్రభుత్వాన్ని కోరుతున్నామన్నారు.

రైతులకు అవగాహన

గంభీరావుపేట: మండలంలోని గోరింటాలలో జిల్లా ఏరువాక కేంద్రం శాస్త్రవేత్తలు, అధికారులు రైతులకు వ్యవసాయం, వ్యవసాయాను బంధ రంగాలపై అవగాహన కల్పించారు. యాసంగికి అనువైన వరి రకాలు, వాటి గుణగణాల గురించి వివరించారు. ఎరువుల యాజమాన్యం గురించి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఏరువాక కేంద్రం కో ఆర్డినేటర్, శాస్త్రవేత్త మదన్‌మోహన్‌రెడ్డి, శాస్త్రవేత్త రాజేంద్రప్రసాద్, మండల వ్యవసాయాధికారి సలావుద్దీన్, ఏఈఈవో ముకుంద్ కుమార్, సాయి తేజ, సింగిల్‌విండో డైరెక్టర్ అంజిరెడ్డి, రైతులు, తదితరులు పాల్గొన్నారు.

సీఎం సోదరుడి కుమార్తె వివాహ వేడుకలో విప్



వేములవాడ: సీఎం రేవంత్‌రెడ్డి సోదరుడు జగదీశ్వర్‌రెడ్డి కూతురు వివాహం హైదరాబాద్‌లోని జీఎంఆర్ అరేనా ఫంక్షన్‌హాల్‌లో బుధవారం జరిగింది. వేడుకల్లో ప్రభుత్వవిప్ ఆది శ్రీనివాస్ సీఎం, ఇతర మంత్రులు, కాంగ్రెస్ ముఖ్య నాయకులతో కలిసి హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు.

రాణాలో నిరసన

సిరిసిల్లటౌన్: బీఆర్‌ఎస్వీ నేతలు బుధవారం సిరిసిల్ల రాణాలో నిరసన తెలిపారు. బీఆర్‌ఎస్వీ రాష్ట్ర నాయకుడు కంచర్ల రవిగౌడ్ మాట్లాడారు. బీఆర్‌ఎస్, బీఆర్‌ఎస్వీ నాయకులను అక్రమ అరెస్టులు అప్రజాస్వామికమన్నారు. రాష్ట్రంలోని గురుకులాల్లో వరుస ఫుడ్ పాయిజన్ కేసులు నమోదయ్యాయన్నారు. విద్యార్థుల ప్రాణాలతో చెలగాటమాడుతున్న ప్రభుత్వానికి తగిన బుద్ధి చెబుతారన్నారు. ఇక్కడ మట్టి శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

● టౌన్ పోలీస్‌స్టేషన్‌కు హోంగార్డులు అటాచ్

వేములవాడ: రాజన్న సన్నిధిలో విధులు నిర్వహిస్తున్న హోంగార్డులను టౌన్ పోలీస్‌స్టేషన్‌కు అటాచ్ చేశారు. జిల్లా పోలీసు యంత్రాంగం నుంచి 25మంది హోంగార్డులు ఆలయ ఆవరణలో వివిధ ప్రాంతాల్లో విధులు నిర్వహిస్తున్నారు. ఇందులో నలుగురు మహిళా హోంగార్డులున్నారు. ఇప్పటివరకు వీరి కంట్రోల్ ఆలయ ఎస్పీఎఫ్ పరిధిలో ఉండేది. ఆకస్మికంగా హోంగార్డులను టౌన్ పోలీస్‌స్టేషన్‌కు అటాచ్ చేసేశారు. దీంతో ఎస్పీఎఫ్ సిబ్బంది వద్దనున్న రిజిస్ట్రార్‌ను ఈనెల 26న టౌన్ పీఎస్‌కు అప్పగించారు. గతంలో హోంగార్డుల సంఖ్య 34 ఉండేదనీ, భక్తుల రద్దీ పెరుగుతున్నా హోంగార్డుల సంఖ్యను పూర్తిగా తగ్గించారని, ఎస్పీఎఫ్ పరిధిలో ఉన్న హోంగార్డుల సర్వీసులను టౌన్ పోలీసులకు అప్పగించారని ఆలయ అధికారులు, సిబ్బంది, పోలీసు విభాగాలు చర్చించుకుంటున్నాయి.

● ఉద్యోగులకు బదిలీలు సహజం

ఇల్లంతకుంట : ఉద్యోగులకు బదలీలు సహజమని జిల్లా విద్యాధికారి రమేశ్‌కుమార్ అన్నారు. మండలంలోని జవారిపేట ప్రాథమిక పాఠశాలలో బదిలీపై వెళ్లిన మల్లేశం అనే ఉపాధ్యాయుడిని సన్మానించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు రవీందర్ తదితరులు పాల్గొన్నారు

● 50వ సారి రక్తదానం

సిరిసిల్లటౌన్: జిల్లా కేంద్రానికి చెందిన కౌన్సిలర్ కల్లూరి రాజు 50వ సారి రక్తదానం చేశారు. పట్టణానికి చెందిన మధు హైదరాబాద్ కిమ్స్ ఆస్పత్రిలో అత్యవసరంగా చికిత్స పొందుతున్నాడు. అతనికి రక్తదానం చేయగా రోగి బంధువులు ఎర్రం మల్లయ్య, లింగయ్య కృతజ్ఞతలు తెలిపారు.

● బోర్ పైపుల అపహరణ

ఎల్లారెడ్డిపేట: మండలకేంద్రంలోని నడిగడ్డ ఏరియాలో గుర్తు తెలియని దొంగలు రైతుల వ్యవసాయ పంటపొలాల వద్ద బోర్ పైపులను మంగళవారం రాత్రి ఎత్తుకెళ్లారు. మండలకేంద్రానికి చెందిన బక్కయ్యగారి సత్తిరెడ్డి వ్యవసాయ పొలం వద్ద బోర్ పైపులను ఎత్తుకెళ్లడంతో పాటు అదే ఏరియాలో కొందరి రైతుల సర్వీస్ వైర్లను కట్ చేశారు. దీంతో రైతులు బుధవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు.

● కబడ్డీ పోటీల ఎంపిక

సిరిసిల్లటౌన్: ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో మహిళల జిల్లాస్థాయి కబడ్డీ పోటీల ఎంపిక బుధవారం నిర్వహించారు. ఇందులో ఎంపికైనవారు హైదరాబాద్‌లోని ఎల్బీ స్టేడియంలో 7 నుంచి 10 తేదీల్లో జరిగే రాష్ట్రస్థాయి టోర్నమెంట్లో పాల్గొంటారని జిల్లా కబడ్డీ అసోసియేషన్ సెక్రెటరీ సింగార తిరుపతి తెలిపారు.ఆర్గనైజ్ సెక్రెటరీ మల్లారెడ్డి, జిల్లా రిఫ్రి బోర్డ్ చైర్మన్ ప్రభాకర్, సెక్రెటరీ మదన్, సీనియర్ క్రీడాకారులు పాల్గొన్నారు.

● ఎల్వోసీలు అందజేత

వేములవాడఅర్బన్: అనారోగ్యంతో బాధపడుతూ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న పలువురికి వేములవాడ ఎమ్మెల్యే ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ ఎల్వోసీలు మంజూరుచేయించారు. పట్టణానికి చెందిన అవినాష్‌కు రూ. 2.5 లక్షలు, గంభీరావుపేట మండలం శ్రీగాధకు చెందిన అమృతకు రూ. 2.5 లక్షలు, కథలాపూర్ మండలం దులూర్ గ్రామానికి చెందిన గంగాధర్‌కు రూ. 1.5 లక్షలు, వేములవాడ మండలం అనుపురంకు చెందిన శంకరయ్యకు రూ.2లక్షలు మంజూరుకాగా అందించినట్లు తెలి పారు.

● రిటైర్మెంట్ బెనిఫిట్స్ అందించాలి

సిరిసిల్లటౌన్: అంగన్‌వాడీలకు సర్కారు న్యాయం చేయాలని ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి కడారి రాములు డిమాండ్ చేశారు. బుధవారం ఏఐటీయూసీ కార్మిక భవన్‌లో జరిగిన సమావేశంలో మాట్లాడారు. రిటైర్ అయిన వారికి టీచర్‌కు రూ.2లక్షలు, ఆయాకు లక్ష ఇవ్వాలన్నారు. ఖాళీ అయిన ఆయా, టీచర్ సెంటర్లలో నూతన నియామకాలు చేపట్టాలన్నారు. సమావేశంలో నాయకులు అజ్జ వేణు, మీసం లక్ష్మణ్, తదితరులు పాల్గొన్నారు.

● మధ్యాహ్న భోజనం తనిఖీ

బోయినపల్లి: మండలకేంద్రంలోని ఆదర్శ పాఠశాలలో మధ్యాహ్న భోజనం తీరును తహసీల్దార్ కాలే నారాయణరెడ్డి బుధవారం తనిఖీ చేశారు. సరఫరా అవుతున్న బియ్యం, కూరగాయలను పరిశీలించారు. విద్యార్థులతో మాట్లాడి మధ్యాహ్న భోజనం గురించి అడిగి తెలుసుకున్నారు. ఆర్ఐ. బాలయ్య, ఉపాధ్యాయులు ఉన్నారు.

● బాలమల్లు పల్లెలో అవగాహన

తంగళ్లపల్లి: మండలంలోని బాలమల్లుపల్లెలో బుధవారం పోలీసుల ఆధ్వర్యంలో గ్రామస్తులకు సీసీ కెమెరాల ఏర్పాటు, బాల్య వివాహాల నిర్మూలన, రేషన్ బియ్యం అక్రమ రవాణాను అరికట్టడంపై అవగాహన కల్పించారు. హెడ్ కానిస్టేబుల్, కానిస్టేబుళ్లు, గ్రామస్తులు పాల్గొన్నారు.

● అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలి

ఎల్లారెడ్డిపేట: విద్యార్థులు అవకాశాలను సద్వినియోగం చేసుకొని చదువులో ఉన్నతంగా రాణించాలని ఎంఈవో కృష్ణహరి అన్నారు. మండలంలోని కిషన్‌దాస్‌పేట పాఠశాలలో స్వయం పరిపాలన దినోత్సవాన్ని బుధవారం నిర్వహించారు. వివిధ పోటీల్లో రాణించిన విద్యార్థులకు ఎంఈవో బహుమతులు ప్రదానం చేశారు. పాఠశాలలో పని చేస్తున్న ఉపాధ్యాయిని రజిత, హెల్పింగ్ హ్యాండ్స్ యూత్ సభ్యులు విద్యార్థులకు రూ. 3 వేల విలువ గల ప్లేట్లను అందజేశారు. రాజన్నపేట మండల పరిషత్ పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు మాజీ సర్పంచ్ ముక్క శంకర్ విద్యార్థులకు టై, బెల్టులు అందించారు.

● బేషరతుగా క్షమాపణ చెప్పాలి

ఎల్లారెడ్డిపేట: కలెక్టర్‌ను కాంగ్రెస్ కార్యకర్తగా ఎమ్మెల్యే కేటీఆర్ అభివర్ణించడం దురదృష్టకరమని బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు దొమ్మాటి నర్సయ్య అన్నారు. మండలకేంద్రంలోని పార్టీ కార్యాలయంలో మాట్లాడారు. వెంటనే బేషరతుగా క్షమాపణ చెప్పాలని డిమాండ్‌చేశారు. పార్టీ మండల అధ్యక్షులు సద్ది లక్ష్మారెడ్డి, నాయకులు రాంరెడ్డి, రాజేందర్, శ్రీను, రవీందర్, బాబు, సంతోష్‌గౌడ్, నంది కిషన్ బండారి బాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

● సమస్యలు పరిష్కరించాలని వినతి

కోనరావుపేట: జిల్లాలోని మధ్యాహ్న భోజన కార్మికులకు గౌరవ వేతనం, విద్యార్థులకు మెనూ చార్జీలు చెల్లించాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ఎగమంటి ఎల్లారెడ్డి అన్నారు. ఎంఈ వో కార్యాలయంలో వినతిపత్రం అందించారు. ప్రభుత్వం ఇప్పటికైనా పెండింగ్ బిల్లులు క్లియర్ చేయాలని డిమాండ్ చేశారు. ఈనెల 29న మండలకేంద్రంలో ధర్నాలో కార్మికులు పాల్గొనాలని కోరా రు. జిల్లా మధ్యాహ్న భోజన రంగం కార్యదర్శి గురుజల శ్రీధర్, మధ్యాహ్న భోజన రంగం కార్మికులు పాల్గొన్నారు.



ముస్తాబాద్: ముస్తాబాద్ జెడ్పీ ఉన్నత పాఠశాల వద్ద, ముస్తాబాద్ – దుబ్బాక రహదారిపై ట్యాంక్ అలంకారప్రాయంగా మారింది. సుభాష్‌నగర్‌లో నీటిని అందించేందుకు నిర్మించిన వాటర్ ట్యాంక్ ఇలా వృథాగా ఉండడంతో రహదారిపై రాకపోకలకు సాగించేందుకు ఇబ్బంది పడుతున్నారు.

సమస్య పరిష్కారానికి సంప్రదించాల్సిన అధికారి :
బీరయ్య, ఎంపీడీవో ముస్తాబాద్. సెల్‌నెంబర్: 9676973358

వాట్సాప్ చేయండి..

మీ ప్రాంతంలో ఉన్న సమస్యను, దానికి సంబంధించిన ఫొటోను మాకు వాట్సాప్‌లో షేర్ చేయండి. ఆ సమస్య ఎప్పటినుంచి ఉందో రాయండి. వాటిని ప్రచురించి సమస్య పరిష్కారానికి 'సాక్షి' కృషి చేస్తుంది. పంపిన వారి పేరు, ఫొటో ప్రచురిస్తాం.

మా ఫోన్ నంబర్లు: 9440243048, 9705346626

కేటీఆర్ నోరు అదుపులో పెట్టుకోవాలి



సిరిసిల్ల టౌన్ : మాట్లాడుతున్న సంగీతం శ్రీనివాస్



ముస్తాబాద్: మాట్లాడుతున్న కాంగ్రెస్ మండల అధ్యక్షుడు బాల్‌రెడ్డి

సిరిసిల్లటౌన్: కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఏడాదిలో రైతులు, చేనేత కార్మికులు సుభిక్షంగా ఉన్నారని, ఇప్పటికైనా కేటీఆర్ నోరు అదుపులో పెట్టుకొని మాట్లాడాలని టీపీసీసీ కోఆర్డినేటర్ సంగీతం శ్రీనివాస్ అన్నారు. బుధవారం పట్టణంలోని ప్రెస్‌క్లబ్‌లో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. అధికార దుర్వినియోగం, కిందిస్థాయి నుంచి ఉన్నతాధికారులను తమ సొంత లబ్ధికి వాడుకున్న చరిత్ర కేటీఆర్‌దేనన్నారు. ప్రభుత్వం ఆరు గ్యారంటీలను ఒక్కొక్కటిగా అమలుచేస్తుంటే జీర్ణించుకోలేక కేటీఆర్ ఆరోపిస్తున్నారన్నారు. అధికారంలో ఉన్నప్పుడు సిరిసిల్లకు నూలు డిపో తేలేదని, వేములవాడలో ఎందుకు ఏర్పాటు చేశారని ప్రశ్నించడం సిగ్గుచేటన్నారు. సిరిసిల్ల ఏఎంసీ చైర్మన్ వెల్ముల స్వరూప, కాంగ్రెస్ పార్టీ జిల్లా మహిళా అధ్యక్షురాలు కాముని వనిత, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు దేవరాజు తదితరులు పాల్గొన్నారు.

తంగళ్లపల్లి: ప్రభుత్వంపై సిరిసిల్ల ఎమ్మెల్యే కేటీఆర్ చేస్తున్న విమర్శలు సరికాదని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ప్రవీణ్ జే టోని అన్నారు. మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ.. బీఆర్‌ఎస్ ప్రభుత్వంలో కాంగ్రెస్ నాయకులపై అక్రమ కేసులు పెట్టారని మండిపడ్డారు. కలెక్టర్, పోలీసుల మీద కేటీఆర్ విరుచుకుపడడం సిగ్గుచేటన్నారు. కాంగ్రెస్ సీనియర్ నాయకులు లింగాల భూపతి, పూర్మాని లింగా రెడ్డి, రాజశేఖర్, ఏఎంసీ డైరెక్టర్లు కళ్లెపల్లి తిరుపతి రెడ్డి, పొన్నాల పరుశురాం, బాలు, నాయకులు తదితరలు పాల్గొన్నారు.

ముస్తాబాద్: అధికారం కోల్పోయి మతిభ్రమించి మాజీ మంత్రి కేటీఆర్ కలెక్టర్‌పై ఆరోపణలు చేస్తున్నారని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు యెల్ల బాల్‌రెడ్డి మండిపడ్డారు. మండలకేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో మాట్లాడారు. పదేళ్లు అధికారంలో ఉండి ప్రజలకు సేవ చేయని కేటీఆర్ ఇప్పుడు ప్రజాప్రభుత్వంలో అధికారులను బెదిరింపులకు గురిచేయడం ప్రజలు గమనిస్తున్నారన్నారు. మాజీ ఎంపీటీసీ గుండెల్లి శ్రీనివాస్, బాల్‌రెడ్డి, తలారి నర్సింలు, రాజేందర్‌రెడ్డి, అంజనేయులు, మల్లేశం, కుమార్, మధు తదితరులు పాల్గొన్నారు.

గంభీరావుపేట: కాంగ్రెస్ ప్రభుత్వానికి వస్తున్న ప్రజాదరణను చూసి ఓర్వలేకనే బీఆర్‌ఎస్ నేతలు అవాస్తవాలు మాట్లాడుతున్నారని కాంగ్రెస్ పార్టీ మండలశాఖ అధ్యక్షుడు హమీద్ అన్నారు. మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. అధికారం కోల్పోగానే బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ కాంగ్రెస్‌పై ఆరోపణలు చేస్తున్నారన్నారు. జిల్లా ప్రధాన కార్యదర్శి రాంచంద్రారెడ్డి, ఏఎంసీ డైరెక్టర్లు ప్రభాకర్, విఠల్ నాయక్, అజాం, నాయకులు రాజుగౌడ్, గౌరీ శంకర్, రాజశేఖర్, ప్రసాద్‌రావు, బాలయ్య, తదితరులు పాల్గొన్నారు.

సభకు తరలిరావాలి

ముస్తాబాద్: మాలలు తమ హక్కుల సాధనకు తలపెట్టిన మాల మహానాడు సభకు పెద్దఎత్తున తరలిరావాలని మాల మహానాడు మండల అధ్యక్షుడు జంగ భూమరాజం అన్నారు. డిసెంబర్1న హైదరాబాద్‌లో తలపెట్టిన మాలల గర్జన కరపత్రాలను మండలకేంద్రంలో బుధవారం ఆవిష్కరించారు. భూమరాజం మాట్లాడుతూ జక్కుల యాదగిరి, రాజు, బత్తుల భాస్కర్, కిషన్, గంగాధర్, కిరణ్, స్వామి, రమేశ్, కొండయ్య, వెంకటేశ్, రామస్వామి, చంద్రం తదితరులు పాల్గొన్నారు.

గంభీరావుపేట: హైదరాబాద్‌లో డిసెంబర్ 1న నిర్వహించనున్న చలో హైదరాబాద్, మాలల సింహగర్జనకు సంబంధించిన ప్రచార పోస్టర్లను మాల మహానాడు జిల్లా అధ్యక్షుడు దోసల చంద్రం ఆధ్వర్యంలో నాయకులు బుధవారం ఆవిష్కరించారు. కార్యక్రమంలో జెల్ల భూదయ్య, వెంకటరాజం, ధనరాజ్, దోసల శంకర్, పిట్ల రఘు, కార్తీక్, అభిలాష్, సుదర్శన్, రమేష్, నితిన్, ప్రసాద్, పాపయ్య తదితరులు పాల్గొన్నారు.



గంభీరావుపేట : పోస్టర్ ఆవిష్కరిస్తున్న నాయకులు

'ఇన్నోవేషన్ 101' లో ఇల్లంతకుంట విద్యార్థి

ఇల్లంతకుంట : మండలంలోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో చదువుతున్న విద్యార్థినికి ఇన్నోవేషన్ 101లో పుస్తకంలో స్థానం లభించింది. తెలంగాణ ఇన్నోవేషన్ సెల్ – ఇంటింటి ఇన్నోవేషన్‌లో భాగంగా రాష్ట్ర వ్యాప్తంగా ఉత్తమ 101 నూతన ఆవిష్కరణలను గుర్తించి ఇన్నోవేషన్ 101 పుస్తకాన్ని ప్రచురించారు. ఇందులో వృద్ధులు, వ్యాధిగ్రస్తులకు ఉపయోగపడే సాధనాన్ని ఆవిష్కరించిన సహస్రకు స్థానం లభించింది. సహస్రను, ఉపాధ్యాయుడు మహేశ్ చంద్రను, ఉపాధ్యాయ సిబ్బంది అభినందించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు ప్రేమలత, ఉపాధ్యాయులు రమణారెడ్డి, మధుసూదన్ రావు, మంజుల, ప్రదీప్ రెడ్డి, లత, అనిల్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

బాల్య వివాహాలపై అవగాహన



వేములవాడరూరల్: వేములవాడ మండలంలోని హన్మాజిపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో బాల్య వివాహాలపై పీహెచ్‌సీ వైద్యురాలు దివ్యశ్రీ అవగాహన కల్పించారు. బుధవారం జెడ్పీహెచ్‌ఎస్ పదో తరగతి విద్యార్థినులకు బాల్య వివాహం వల్ల కలిగే అనర్థాలపై వివరించారు. కార్యక్రమంలో ఆరోగ్య పర్యవేక్షకులు గంగమరాజు, ఎంఎల్‌హెచ్‌పీ సుజాత, ఎన్‌సీడీ స్టాఫ్ నర్స్ గాయత్రి,, ఏఎన్‌ఎంలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత

ఇల్లంతకుంట : బెజ్జంకి మండలంలోని ముత్తన్నపేట గ్రామానికి చెందిన కనగండ్ల రంజిత్ (26) గాగిల్లాపూర్ వాగు నుంచి ఇసుకను అక్రమంగా ట్రాక్టర్‌లో తరలిస్తుండగా పట్టుకున్నట్లు ఎస్సై శ్రీకాంత్ గౌడ్ తెలిపారు. అనంతరం అతడిని రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై పేర్కొన్నారు.